క్లుప్తంగా

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

జెడ్పీటీసీ కొండల్‌రెడ్డి


రికార్డులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ కొండల్‌రెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తామని జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. సిబ్బంది విధులకు రాకుండా వచ్చినట్లు సంతకాలు చేస్తున్నారని మండిపడ్డారు. విధులకు రానివారిని వచ్చినట్లు చూపడం సరికాదన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

వసతి గృహాలు మంజూరు చేయాలి

ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్


జిల్లా అధికారికి వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట జిల్లా హుస్నాబాద్, చేర్యాలకు ఎస్సీ బాలుర కళాశాల వసతి గృహాలను మంజూరు చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు మంగళవారం జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అభివృద్ధి అధికారి కవితకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్ మాట్లాడుతూ హుస్నాబాద్ పట్టణంలో 13 కళాశాలలు ఉన్నాయని, అందులో సుమారు 350 మంది ఎస్సీ విద్యార్థులు చదువుతున్నారన్నారు. చేర్యాలలోని 17 కళాశాలల్లో 400 మంది ఎస్సీ విద్యార్థులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి విద్యనభ్యసిస్తున్నారని, వసతి గృహాలు లేక వారు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా మన్నె శ్రీనివాస్



ములుగు(గజ్వేల్): బీజేపీ ములుగు మండల నూతన అధ్యక్షుడిగా బస్వాపూర్ గ్రామానికి చెందిన మన్నె శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మన్నె శ్రీనివాస్ మంగళవారం వంటిమామిడిలో మాట్లాడుతూ మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. అభివృద్ధి, సంక్షేమం బీజేపీతోనే సాధ్యమన్నారు. తనకు మండల అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నిరుపయోగంగా బస్టాండ్


చిన్నకోడూరు బస్టాండ్

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రజల సౌలభ్యం కోసం నిర్మించిన బస్టాండ్ వినియోగంలోకి తీసుకురాకపోవడంతో నిరుపయోగంగా మారింది. చిన్నకోడూరు మండల కేంద్రంలో ప్రయాణికుల సౌకర్యార్థం 20 ఏళ్ల కిందట రూ.8 లక్షల వ్యయంతో బస్టాండ్ నిర్మించారు. అప్పటి రవాణా శాఖ మంత్రి, మాజీ సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించారు. బస్టాండ్ వినియోగంలో లేకపోవడంతో సంచార జాతుల వారికి, వివాదాల పంచాయితీల నిర్వహణకు అడ్డాగా మారింది. బస్టాండ్ ప్లాట్‌ఫామ్‌లో రైతులు ధాన్యం ఆరబోస్తున్నారు. బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

మహిళలు అభివృద్ధి చెందాలి

కొమురవెల్లి(సిద్దిపేట): అన్నిరంగాల్లో మహిళలు అభివృద్ధి చెందాలని ఎంపీపీ తలారి కీర్తన అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మహిళాదినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు.

రంజాన్ ప్రార్థనలు ప్రారంభం

గజ్వేల్‌రూరల్: రంజాన్ మాసం ప్రారంభమైంది. గుచ్చి మసీద్‌లో ముస్లింలు మంగళవారం సాయంత్రం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం జరిగిన ఇఫ్తార్‌లో విందులో ఇమామ్ జహంగీర్, ఖాజీ జహంగీర్, నాయకులు మతిన్, సర్దార్‌ఖాన్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

అపరిశుభ్రంగా జనావాసాలు

- మురుగు కాల్వల్లో చెత్తాచెదారం
- రోగాల బారినపడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు


రామవరంలోని ఎస్సీ కాలనీలో చెత్తచెదారం నిండిన మురుగు కాల్వ

మండలంలోని మేజర్ గ్రామపంచాయతీల్లోనూ పారిశుద్ధ్యం లోపించింది. చెత్తా చెదారం ఎక్కడికక్కడ పేరుకుపోతోంది. మురుగు రోడ్లపైనే పారుతోంది. దోమలు, ఈగల బెడదతో ప్రజలు అల్లాడుతున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని రామవరం గ్రామంలో పారిశుద్ధ్య సమస్య తీవ్రమవుతోంది. గ్రామంలోని ఎస్సీ కాలనీలో పారిశుద్ధ్య నిర్వహణ సరిగ్గా లేక దుర్గంధం వెదజల్లుతోంది. మురుగు కాలువలో నిలిచిన నీళ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వస్తుండటంతో ఇంటిలో ఉండలేకపోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు కాలువలోంచి తీసిన చెత్తచెదారం జనావాసాల్లో కుప్పలు వేసి వారం తర్వాత తీస్తున్నారని కాలనీవాసులు చెబుతున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తరచూ పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

అపరిశుభ్ర పరిసరాలు

డ్రైనేజీకి అత్యంత సమీపంలో నివసించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్త చెదారం తీయకపోవడంతో పరిసరాలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. దోమలు, ఈగలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. రోగాల బారిన పడుతున్నామని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీలు శుభ్రం చేయించాల్సిన కార్యదర్శి పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

భరించలేని దుర్వాసన



మురుగు కాలువలను శుభ్రం చేయడంలేదు. పరిసరాలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. కాలువను చేయకపోవడంతో దోమలు, ఈగల వ్యాప్తితో అనారోగ్యానికి గురవుతున్నాయి. చెత్త చెదారంతో నిండి భరించలేని దుర్వాసన వస్తుంది. పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు.
– కర్ణకంటి దివ్య, ఎస్సీ కాలనీ రామవరం

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ


స్వయం పాలనలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

ప్రశాంత్‌నగర్: ప్రాథమిక దశలోనే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని భావిభారత పౌరులుగా ఎదగాలని సిద్దిపేట నంబర్–1 ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రేణుక విద్యార్థులకు సూచించారు. మంగళవారం పాఠశాలలో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి వారికి పాఠాలు బోధించారు. డీఈఓగా దినేశ్, హెచ్‌ఎంగా లిఖిత, ఎంఈఓగా ధనుష్, ఎంఎస్ఓగా భరత్, ఉపాధ్యాయులుగా హైందవి, అద్విత, శివసాయి, భరత్ వ్యవహరించారు. ఇందులో ప్రతిభ చూపిన వారికి ఉపాధ్యాయులు కవిత, అర్షియా జహా, దుర్గాప్రకాశ్, శిరీష, దీప, విశాలితో కలిసి హెచ్‌ఎం బహుమతులు ప్రదానం చేశారు.

దమ్మక్కపల్లి ప్రాథమిక పాఠశాలలో ..

కొండపాక(గజ్వేల్): మండలంలోని దమ్మక్కపల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఎంఈఓ నిఖిల్, హెచ్‌ఎం స్వాతి వ్యవహరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాంచంద్రారెడ్డి, ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.ట

గ్రామస్తుల ఆందోళన


వైన్ షాపు ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండలం కూటిగల్ గ్రామంలో సమ్మక్క–సారలమ్మ జాతర కమిటీ సభ్యులు మంగళవారం గ్రామస్తులతో కలిసి వైన్‌షాపు ఎదుట ఆందోళన చేశారు. సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా కొబ్బరికాయలు, మద్యం తదితర వాటికి వేలం పాటలు నిర్వహించారు. మద్యం విక్రయానికి రూ.2.50 లక్షలకు సత్యం వైన్‌షాపు యాజమాని వేలం పాట పాడాడు. జాతర ముగిసినా ఇప్పటి వరకు డబ్బులు ఇవ్వకపోవడంతో జాతర కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకారులను పోలీసు స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించినట్లు ఏఎస్ఐ జగదీష్ తెలిపారు.

విగ్రహాలు ధ్వంసం


చిన్నకోడూరులో ధ్వంసమైన విగ్రహాలు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల కేంద్రంలో జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలే విగ్రహాలు ట్రాక్టర్ ఢీ కొనడంతో ధ్వంసమయ్యాయి. రోజు మాదిరిగానే చెత్త సేకరణకు వస్తున్న ట్రాక్టర్ యూటర్న్ తీసుకుంటున్న క్రమంలో అదుపు తప్పి ట్రాలీ ఢీకొట్టడంతో విగ్రహాలు గద్దె కూలిపోయింది. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో విగ్రహాలు ఏర్పాటు చేయిస్తామని ఆయా సంఘాల నేతలకు మాజీ సర్పంచ్ ఉమేష్ చంద్ర హామీ ఇచ్చారు. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా విగ్రహాల ధ్వంసంపై తమకు ఫిర్యాదు రాలేదని ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

సిద్దిపేటరూరల్: ఇర్కోడ్ గ్రామంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్నందున బుధవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఇర్కోడ్, భూర్గుపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

పెండింగ్ బిల్లుల కోసం వినతి

కొండపాక(గజ్వేల్): గ్రామ పంచాయతీ కార్మికులకు రావల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఎంపీడీఓ కార్యాలయంలో సీఐటీయూ నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అమ్ముల బాల్‌నర్సయ్య, బర్మ కొమురయ్య, ఆరుట్ల నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ముత్యంరెడ్డి ఆశయాలను కొనసాగించాలి

మిరుదొడ్డి(దుబ్బాక): దివంగత మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి ఆశయాలను కొనసాగించాలని దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని చెప్యాల క్రాస్ రోడ్డులో ముత్యం రెడ్డి విగ్రహాన్ని మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం మండల పరిధిలోని మల్లుపల్లి, అల్వాలలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి


డాక్టర్ రమేష్‌బాబును అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రమేష్‌బాబు అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందడంపై ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం కళాశాలలో ఆయనను సన్మానించి మాట్లాడారు. కళాశాలలో జంతుశాస్త్ర విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రమేశ్‌బాబు పదోన్నతి పొందడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ గణపతి, లెఫ్టినెంట్ డాక్టర్ భవాని, అధ్యాపకులు బాలరాజు, ఓంప్రకాష్, పెద్దిరాజు, కవిత, మార్కండేయ, లక్ష్మీ, నర్సయ్య, విష్ణు, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి రాకుండా చూడాలి

ఎంపీపీ శ్రీదేవి


మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీదేవి

సిద్దిపేటరూరల్: రానున్న రోజుల్లో గ్రామాల్లో నీటి కొరత రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ శ్రీదేవి అన్నారు. మంగళవారం రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల స్థాయి అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి, పరిపాలన విషయంలో ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎంపీపీ, మహిళా అధికారులకు సన్మానించారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు యాదయ్య, ఎంపీడీఓ సమ్మిరెడ్డి, ఎంపీటీసీలు, కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో అవకతవకలు


అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అడిషనల్ పీడీ బాలకృష్ణ

మద్దూరు(హుస్నాబాద్): మండలంలో 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి వరకు నిర్వహించిన ఉపాధి హామీ పనులపై మంగళవారం 15వ సామాజిక తనిఖీ నిర్వహించారు. తనిఖీలో వెలుగు చూసిన అవకతవకలపై జెడ్పీటీసీ గిరి కొండల్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీల్లో ఏడు రకాల రిజిస్టర్లను నిర్వహించడంలేదని, రోజ్‌గార్ దివాస్‌పై కూలీలకు అవగాహన కల్పించలేదన్నారు. కూలీలకు బిల్లుల చెల్లింపులో నిర్లక్ష్యం వహించారని సభదృష్టికి తెచ్చారు. మస్టర్‌లో సంతకాలు లేకుండా డబ్బులు తీసుకున్నారన్నారు. అలాగే లద్నూరులో 2019లో చనిపోయిన వ్యక్తి పని చేసినట్లుగా 2022లో రూ.వెయ్యి చెల్లించాలరని తెలిపారు. కూటిగల్‌లో చేసిన పనులకు తప్పుడు లెక్కలు చూపించి రూ.28,980లు డబ్బులు తీసుకున్నారు. అవకతకలపై చర్యలు తీసుకోన్నుట్లు అడిషనల్ పీడీ బాలకృష్ణ తెలిపారు.

సాదాసీదాగా ఎంపీపీ సమావేశం


మాట్లాడుతున్న ఎంపీపీ కీర్తన

కొమురవెల్లి(సిద్దిపేట): మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అధ్యక్షురాలు తలారి కీర్తన అధ్యక్షతన మంగళవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తమ గ్రామాల సమస్యలను ఎంపీటీసీలు సభ దృష్టికి తెచ్చారు. వివిధ శాఖల అధికారులు సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వేసవిలో గ్రామాలలో మంచినీటి సమస్య తలెత్తకుండా మిషన్ భగీరథ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని ఎంపీటీసీలకు తెలిపారు. వరి పంటలో మొగి పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. మండలంలోని ఎరువుల దుకాణాల్లో నకిలీ పురుగు మందులు విక్రయించకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ కాయిత రాజేందర్ రెడ్డి, ఎంపీటీసీలు, మండల ప్రత్యేకాధికారి శారద, ఎంపీడీవో కుమారస్వామి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితేనే జీవితంలో రాణింపు

గజ్వేల్ సీఐ సైదా

గజ్వేల్: ఇష్టపడి చదువుకుంటేనే జీవితంలో రాణిస్తారని గజ్వేల్ సీఐ సైదా అన్నారు. మంగళవారం గజ్వేల్ మండలం అహ్మదీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో విద్యార్థులకు బాల్యవివాహాలు, మహిళల రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల కలలను నిజం చేసే విధంగా ఏకాగ్రతతో చదువుకోవాలన్నారు. సైబర్ నేరాలు, అపరిచితుల పట్ల జాగ్రత్త ఉండాలన్నారు. వ్యక్తిగత సమాచారం ఎవరికీ ఇవ్వకూడదన్నారు. బాల్య వివాహాలతో అనర్థాలు జరుగుతున్నాయని, వీటికి అడ్డుకట్ట వేయడానికి ప్రజలు సహకరించాలని కోరారు. ఏదైనా సైబర్ నేరం జరిగితే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుగుణాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెరువులు నింపాలని ఆందోళన


కొండపాకలో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

మద్దూరు(హుస్నాబాద్): లద్దూరు రిజర్వాయర్ ద్వారా మద్దూరు మండలంలోని చెరువులు, కుంటలను వెంటనే నింపాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాళ్లబండి శశిధర్ అన్నారు. మంగళవారం రిజర్వాయర్ ద్వారా చెరువులను నింపాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం తహసీల్దార్ అనంతరెడ్డి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో భూగర్భ జలాలు తగ్గి బోర్లు, బావులు ఎండిపోతున్నాయన్నారు. పంటలకు నష్టం వాటిల్లకుండా లద్దూరు రిజర్వాయర్‌ను దేవాదుల నీటి ద్వారా నింపి కాలువ ద్వారా మండలంలోని అన్ని చెరువులు, కుంటలనునింపి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

కొండపాక(గజ్వేల్): తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి గ్రావిటీ కాలువ ద్వారా మండలంలోని చెరువులు నింపాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి అమ్ముల బాల్‌నర్సయ్య మాట్లాడుతూ వర్షాభావ నేపథ్యంలో ఈయేడు యాసంగిలో రైతులు తక్కువ విస్తీర్ణంలో వరి సాగును చేశారన్నారు. వరి పంటకు ఆశిస్తున్న తెగుళ్ల నివారణకు రైతులు అప్పులు చేసి మందులు పిచికారీ చేస్తూ పంటలను కాపాడుకుంటున్నారన్నారు. ఈ క్రమంలో ఎండలకు బోరుబావుల్లో నీటి నిల్వలు కనిష్టస్థాయికి చేరుకుంటుండటంతో పంటలు ఎండిపోతున్నాయన్నారు. అనంతరం తహసీల్దార్ దిలీప్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు.

చేర్యాల(సిద్దిపేట): తపాసుపల్లి రిజర్వాయర్ నీటితో చేర్యాల ప్రాంతంలోని చెరువులు, కుంటలను నింపి ఎండిపోతున్న పంట పొలాలను కాపాడాలని సీపీఎం మండల కార్యదర్శి కొంగరి వెంకట్‌మావో డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ సమీర్ అహ్మద్ ఖాన్‌కి వినతి పత్రం అందించారు.

సంక్షిప్త వార్తలు

◆ నూతన నియామకం

బెజ్జంకి(సిద్దిపేట): యూత్ కాంగ్రెస్ బెజ్జంకి టౌన్ ప్రెసిడెంట్‌గా కూరెల్ల సంపత్‌ను నియమించినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రత్నాకరరెడ్డి మంగళవారం తెలిపారు. తన నియామకానికి సహకరించిన మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డికి సంపత్ కృతజ్ఞతలు చెప్పారు.

◆ ఘనంగా ఆలయ వార్షికోత్సవం

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని గాగిల్లాపూర్ గ్రామంలో త్రిశూలేశ్వరస్వామి, నాగసుబ్రహ్మణేశ్వర స్వామి ఆలయ 6వ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాలతో పాటు గణపతి, రుద్రహోమం, నవగ్రహ, శివపార్వతుల కల్యాణం జరిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్, మాజీ సర్పంచ్ బొల్లు కృష్ణవేణి మాట్లాడారు. గత ఐదేళ్లుగా ఆలయ వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మేక మాధవి, పీఏసీఎస్ డైరెక్టర్ మేక మల్లేశం, పూజల బుచ్చయ్య, మేక ఉమామహేశ్వర్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

◆ ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

దుబ్బాక: వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఎస్ఐ గంగరాజు అన్నారు. మంగళవారం దుబ్బాకలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వాహన పత్రాలు సరిగాలేని, హెల్మెట్ ధరించని 20 మంది వాహనదారులకు రూ. 3600 జరిమానా విధించామన్నారు.

◆ సీసీ రోడ్ల పనులు ప్రారంభం

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని అయినాపూర్, పోసాన్‌పల్లి, లెనిన్‌నగర్ గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టారు. ఈ పనులను మంగళవారం జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కార్యకర్తలతో కలసి ప్రారంభించారు. కార్యక్రమంలో మల్లన్న ఆలయ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ ఘనంగా వీడ్కోలు సమావేశాలు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామునిపట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. 9వ తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ బహుమతులు అందజేశారు. విద్యార్థులు చేసిన నృత్యాలు, ఆటపాటలు, నాటక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పదో తరగతి వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు సాధించి పాఠశాలకు, గ్రామానికి పేరు తీసుకురావాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజశ్రీ, ఉపాధ్యాయులు చంద్రశేఖర శర్మ, లక్ష్మయ్య, వనజ, తిరుపతి, ఉమారాణి, రాజు, బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

హుస్నాబాద్‌రూరల్: పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు 10 జీపీఏ సాధించాలని హెచ్‌ఎం వేణు కుమార్ అన్నారు. మంగళవారం మీర్జాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తరాల లత, పొన్నబోయిన శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ హుండీ లెక్కింపు

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండల పరిధిలోని సమ్మక్క–సారలమ్మ హుండీ లెక్కంపును మంగళవారం నిర్వహించారు. సమ్మక్క–సారలమ్మ జాతరలో అమ్మవార్లకు భక్తులు సమర్పించిన నగదు, బంగారు, వెండి కానుకలను ఆలయ నిర్వాహకులు గ్రామ పంచాయతీ కార్యాలయంలో లెక్కించారు. కానుకలు మొత్తం రూ.1.45 లక్షలు వచ్చాయని తెలిపారు.

◆ నల్లపోచమ్మ ఆలయ పాలక మండలి నియామకం

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని నాగపురి శివారు నల్లపోచమ్మ ఆలయ పాలక మండలిని నియమిస్తూ దేవాదాయ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ సభ్యులుగా అందె విజయలక్ష్మి, ఆరుట్ల వినీత్ బాబు, గూడెపు మహేశ్వర్, కచాల వెంకటస్వామి, ఆలయ అర్చకుడు శనిగరం సత్తయ్య మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు.

◆ సంక్షేమ పథకాల అమలు కాంగ్రెస్‌కే సాధ్యం

జగదేవ్‌పూర్(గజ్వేల్): సంక్షేమ పథకాల అమలు కాంగ్రెస్ ప్రభుత్వానికే సాధ్యమని కొండపోచమ్మ ఆలయ మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు హన్మంతరెడ్డి అన్నారు. ఆరు గ్యారంటీల అమలులో భాగంగా సోమవారం భద్రాచలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టడంతో మంగళవారం మండలంలోని మునిగడప గ్రామంలో సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు మచ్చేందర్‌రెడ్డి, ప్రసాద్, వెంకటస్వామి, కిషన్, భాను, అశోక్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా డీవీ

బెజ్జంకి(సిద్దిపేట): కరీంనగర్ జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా బెజ్జంకి మండల కేంద్రానికి చెందిన దోనె వెంకటేశ్వర్‌రావును నియమిస్తున్నట్లు టీపీసీసీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ నవీన్ పట్టెం మంగళవారం తెలిపారు. తన నియామకానికి సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ, సోషల్ మీడియా చైర్మన్ సతీష్, కోఆర్డినేటర్ నవీన్ పట్టెం, తదితరులకు డీవీ రావు కృతజ్ఞతలు తెలిపారు. బెజ్జంకి మండలాన్ని కరీంనగర్ జిల్లాలో విలీనం చేయాలని పోరాడుతున్న దశలో కరీంనగర్ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా నియమించడం సంతోషం ఉందన్నారు.

◆ పీఎస్ కమిటీ సమావేశం

దుబ్బాక: శాంతియుత వాతావరణంలో రంజాన్ పండుగ జరుపుకోవాలని దుబ్బాక ఎస్ఐ గంగరాజు అన్నారు. రంజాన్ మాసం ప్రారంభమైన నేపథ్యంలో మంగళవారం దుబ్బాక పోలీస్ స్టేషన్‌లో ముస్లిం మతపెద్దలు, హిందూ ఉత్సవ కమిటీ సభ్యులతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా పండుగలు జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది హరిసింగ్, శ్రీనివాస్, భిక్షపతి, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

◆ శాంతి భద్రతలకు ప్రాధాన్యం
సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్

సిద్దిపేటకమాన్: శాంతి భద్రతలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. మంగళవారం సిద్దిపేటలో కేంద్ర బలగాలు, త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్‌లతో కలిసి పోలీసు అధికారులు, సిబ్బంది మంగళవారం కవాతు నిర్వహించారు. నర్సాపూర్ చౌరస్తా, నెహ్రూ పార్క్, లాల్ కమాన్, బారాయిమామ్, పారుపల్లి వీధి, బోయిగల్లి, అంబేడ్కర్ నగర్, సంజీవయ్య నగర్ కవాతు కొనసాగింది.